క్లుప్తంగా

ఆత్మకూరులో ప్రతిరోజూ 'స్పందన'

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో, మండల పరిధిలోని అన్ని సచివాలయాలలో ప్రతి రోజూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్న తెలిపారు. ప్రజలు తమకు ఏవైనా ఇబ్బందులు, అర్జీలు ఉంటే తమ గ్రామ పరిధిలోని సచివాలయానికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్ వద్ద రిజిస్టర్ చేసి రశీదు తీసుకోవాలన్నారు. వారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

వెంకటేశ్వర్లుకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని మాణిక్యమ్మ సెల గిరిజన గూడెం నాయకుడు, గిరిజన సంఘం అధ్యక్షుడు కుడుముల వెంకటేశ్వర్లుకు గిరిజన సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ నెల 12న మృతి చెందడంతో ఆయన సంతాప సభను శనివారం మాణిక్యమ్మ సెల చెందు గూడెం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను నాయకులు కొనియాడారు. వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు కొమరం భీం గిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు ఆశీర్వాదం, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ , పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు జ్ఞాన దేశీగన్ తదితరులు నిత్యావసర సామగ్రిని, 100కేజీల బియ్యం వారి కుటుంబ పోషణ కోసం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజునాయక్, మహేష్‌రెడ్డి, లింగం, హనుమ నాయక్ తదితరులు ఉన్నారు.

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూరు: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్(ఐసా) అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున కోరారు. పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో శనివారం వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసా జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి, రాజు, వర్ధన్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం మండల ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ నూతన కమిటీని శనివారం సున్నిపెంటలో ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్ బాషా తెలిపారు. మండల అధ్యక్షుడిగా జ్ఞానదేశీగన్, కార్యదర్శిగా వేణులతో పాటు11 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జునైద్‌బాషా మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కళాశాలలో, పాఠశాలల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యులు వై.ఆకాష్, కౌషిక్, సాయి, సుభాష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మిడుతూరు: నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, తహసీల్దార్ వెంకటనారాయణ, ఎస్‌ఐ జయన్న హెచ్చరించారు. శనివారం మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో మిడుతూరులోని కిసాన్ అగ్రిమాల్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్‌లో అవకతవకలుండటంతో 202 యూరియా బస్తాలు(ఇఫ్‌కో)రూ. 53,833 విలువ , 20–20–0–13 76 బస్తాలు, రూ. 87, 400 విలువ కల ఫర్టిలైజర్‌ను విక్రయాలు జరపకుండా నిలిపివేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, కిసాన్ అగ్రిమాల్ మేనేజర్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



ఐఏఎస్‌లతో ఆలయ అధికారులు, అర్చకులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది ఐఏఎస్ అధికారులు శనివారం పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి వారికి స్వాగతం పలికారు. ఐదు వారాల పాటు జరిగే ఆరంభ శిక్షణలో భాగంగా స్మరణ్‌రాజు (అనకాపల్లి జిల్లా), యశ్వంత్ కుమార్‌రెడ్డి(ఈస్ట్‌గోదావరి), సహదిత్ వెంకట్ త్రివాంగ్(విజయనగరం), కుషాల్‌జైన్(అనంతపురం), ఎం.మౌర్య భరద్వాజ్(వైఎస్సార్ జిల్లా), శ్రీకాకుళం, ప్రకాశం, ఏలూరు, నెల్లూరు జిల్లాల నుంచి రాఘవేంద్ర మీనా, శౌర్యమాన్ పటేల్, టి.శ్రీపూజ, సంజన సింహాలు వచ్చారు.

మాది పేదల ప్రభుత్వం

- ప్రతి గడపకు పథకాలు అందించేందుకే సచివాలయ వ్యవస్థ
- నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్ల మనోభావాలు దెబ్బతీస్తారా?
- 'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మహానందిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శనివారం రేగడగూడురు గ్రామంలోని సచివాలయం–2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 746 వినతులు స్వీకరించగా 734 సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. మిగతా 12 కూడా వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయించాలని కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తానని హామీ ఇవ్వడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు.

పవన్ కల్యాణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు

సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి గడపకు పథకాలు చేరుస్తుంటే ఓర్వలేక పవన్ కల్యాణ్ అవాకులు చవాకులు పేల్చుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. సచివాలయ వ్యవస్థ మీద అవగాహన లేకుండా విమర్శలు చేయడం తగదన్నారు. వలంటీర్లలో 60 శాతానికి పైగా మహిళలే ఉన్నారని.. వారంతా ప్రభుత్వంలో భాగస్వాములేనన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా

మండలంలోని మత్స్యకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే శిల్పా భరోసా కల్పించారు. శనివారం మండలంలోని వంద కుటుంబాల మత్స్యకారులు ఎమ్మెల్యేను కలిశారు. మత్స్యకారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ డీటీ చింతామణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ రమిజాబీ, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఆత్మకూరు: నియోజకవర్గంలో అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో తాను ఒంటరిగా పర్యటించానని, ఆ సమయంలో జనసేన, టీడీపీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా కరోనా సమయంలో బయట తిరగడమే కాకుండా ప్రజలకు ధైర్యం కల్పిస్తూ అండగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, రవినాయక్, రాజగోపాల్, కోట్ల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలంటే సినిమా కాదు

మహానంది: రాజకీయాలంటే రెండున్నర గంటల సినిమా కాదని, సినిమాలు వేరు, రాజకీయాలు వేరని తెలుసుకో పవన్ కల్యాణ్ అంటూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. మహానందిలో శనివారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. 590 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థను దేశంలోని అన్ని రాష్ట్రాల వారు ప్రశంసిస్తుంటే పవన్‌కల్యాణ్ తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. మరో పక్క చంద్రబాబుకు వయసు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదని దుయ్యబట్టారు. పథకాల పేరుతో జిమ్మిక్కులు చేయడం మాత్రమే తెలుసని స్పష్టం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో చెప్పినవి, చెప్పనివి అన్నీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పరమేశ్వరి, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ దైవందిన్నె వెంకటేశ్వర్లు, నాయకులు మల్లికార్జున, జయసింహారెడ్డి, భూమా సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తప్పిదాలే పేదలకు శాపం

టీడీపీ తప్పిదాల వల్లే పేద ప్రజలకు శాపంగా మారిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజాసాధికారిక సర్వే పేరుతో టీడీపీ నేతలు ఇంట్లో కూర్చుని సర్వే చేయడం ద్వారా ఎక్కువ వయసున్నవారికి తక్కువ, తక్కువున్న వారికి ఎక్కువ వేయడం ద్వారా ఎంతో మంది పేదలు పథకాలు పొందలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో 1026 మంది దరఖాస్తులు ఇవ్వగా 1017 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీటీసీ ఎర్రం పార్వతమ్మ, జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి,నాయకులు, పిట్టం పెదరామసుబ్బారెడ్డి, ఓంకారం మాజీ చైర్మన్ చింతకుంట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ నడిపి, మొక్కలు నాటిన ఎమ్మెల్యే శిల్పా



ట్రాక్టర్ నడుపుతూ పొలాన్ని చదును చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది సమీపంలోని కృష్ణనంది మార్గంలో ఉన్న చెంచులక్ష్మి గిరిజన గూడెంలో శనివారం సాయంత్రం వారికి ఇచ్చిన పొలాల్లో టెంకాయ మొక్కలు నాటారు. 21ఎకరాల్లో 1,491 మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా నాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ చలంచలం శిరీష తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



మంత్రి ఆర్కేరోజాకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొలనుభారతిదేవి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి కోరారు. శనివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ముచ్చుమర్రిలో క్రీడా, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలసి మర్యాద పూర్వకంగా కలిశారు. కొలనుభారతి దేవి ఆలయ విశిష్టతను వారికి వివరించారు. స్పందించిన ఆమె కొలనుభారతిదేవి ఆలయాన్ని స్వయంగా సందర్శించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి రోజాకు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఆయన వెంట నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్దన్, కో–ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



వడ్డెమానులో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



ఎర్రమఠంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రత్యేక అధికారి రఘురామ్



పాతముచ్చుమర్రిలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, అధికారులు

మిడుతూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాసపేట గ్రామంలో సర్పంచ్ షంషూన్‌బీ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధికోసమే సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రఘురామ్ అన్నారు. వాటి అర్హత కోసం ఉచితంగా సర్టిఫికెట్లు మంజూరు చేస్తుందన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రమఠం గ్రామంలో సచివాలయం వద్ద ఎంపీడీఓ మేరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 395 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిచారు. కార్యక్రమంలో సర్పంచు బాల ఎల్లయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, పీఏఎల్ ఆర్‌డీటీ పెద్దన్న, ఏఓ మహేష్, ఎంఈఓ శ్రీరాములు,ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్ పాల్గొన్నారు.

పగిడ్యాల: ప్రతి కుటుంబంలో సమస్యలు పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న 11 రకాల ఉచిత సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. శనివారం పాత ముచ్చుమర్రి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 150 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్, సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మద్దిలేటి, శ్రీనివాసరెడ్డి, రాంబాబు, బోయ మధు, విస్సు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని రుద్రవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు 88 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు రామస్వామి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఎంఈఓ బాలాజీనాయక్, కో ఆప్టెడ్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రావు, నాగయ్య, శంకర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని వడ్డెమాను ఎంపీటీసీ దేవమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, మండల ఎంపీడీఓ శోభారాణి, భూసర్వే డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు వద్ద పొలం విషయంలో జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు. నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన కైపా మహేశ్వరరెడ్డికి ఏ కోడూరులో పొలం ఉండగా రీ సర్వే కోసం వెళ్లాడు. అయితే పొలం మాదంటూ కోడూరుకు చెందిన సలాంతో పాటు మరో ముగ్గురు దాడి చేశారని, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇంట్లో చోరీపై..

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన పెద్దగోవర్ధనయ్య ఇంట్లో దొంగతనం జరిగిన విషయమై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటికి వేసిన తాళాన్ని యాక్సిల్‌బ్లేడ్‌తో కోసి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడినట్లు తెలిపారు. ఇంట్లోని బీరువాను రాడ్డుతో పెకలించి అందులోని రూ.14వేల విలువైన 20తులాల వెండిని దోచుకెళ్లినట్లు వెల్లడించారు.

అర్ధ చాతుర్మాస దీక్షలో ప్రజ్ఞానందసరస్వతి స్వామి



పూజ నిర్వహిస్తున్న స్వామీజీ

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వాసవీ సత్రంలో ఆషాడ శుద్ధ ఏకాదశి నుంచి భాద్రపద మాసం ఏకాదశి వరకు 60 రోజుల పాటు అర్ధచాతుర్మాస దీక్షను ప్రజ్ఞానందసరస్వతి స్వామీజీ (తెనాలి బాల స్వామి) స్వీకరించారు. ఇందులో భాగంగా శనివారం ప్రత్యేక మండపానికి విశేషపూజలతో దీక్షా క్రతువును ప్రారంభించారు. ప్రతిఏటా ఒక్కో క్షేత్రంలో అర్ధచాతుర్మాస దీక్షను తీసుకుని నియమ నిష్టలతో మౌనవ్రతం పాటిస్తామన్నారు. దీక్షతో సమస్త పాపాలు తొలగిపోవడమే కాక మంత్ర ప్రక్రియలో లోకకల్యాణార్థం సంకల్పం చెప్తామన్నారు.

నేడు శ్రీచౌడేశ్వరి దేవి జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీచౌడేశ్వరి దేవాలయంలో ఆదివారం శ్రీచౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమై సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగుతాయన్నారు. ఉదయం 7 గంటలకు అమ్మవారి క్షీరాభిషేకం, 8 గంటలకు అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలుంటాయన్నారు. 9 గంటలకు శ్రీదుర్గా హోమం, మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారికి బోనాల ఊరేగింపుకు, రాత్రి 8 గంటలకు తొట్లోత్సవం, రాత్రి 9 గంటలకు వివిధ గ్రామాల భక్తబృందంతో వేకువజాము వరకు భజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అమ్మవారి జయంతి సందర్భంగా వార్డు కౌన్సిలర్ సభ్యులు విజయ్ ఆధ్వర్యంలో మారబత్తుల రామలక్ష్మమ్మ, మారబత్తుల స్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మహానందిలో మాసశివరాత్రి

మహానంది: మహానందిలో ఆదివారం శ్రీ కామేశ్వరీదేవికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు ఐదు వందల మంది అమ్మవారికి చీర, సారె సమర్పిస్తారన్నారు.

కరోనా సమయంలో ఆసుపత్రికెళ్లి..



చికిత్స పొందుతున్న రంగారెడ్డికి పింఛను అందిస్తున్న వలంటీర్ సరిత

అసలే కరోనా మహమ్మారి విజృంభిస్తుంది. తుమ్మినా, దగ్గినా స్వంత కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లలేని పరిస్థితి. అలాంటి సమయంలో మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన కల్లూరి రంగారెడ్డి దగ్గు, అయాసం, జ్వరంతో బాధపడుతూ నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. అసలే కరోనా భయం, ఆపై ఎవరూ దగ్గరికి వెళ్లలేని పరిస్థితి. అయితే సరిగ్గా ఒకటోతేదీ రాగానే వలంటీర్ సరిత రంగారెడ్డి ఇంటికి వెళ్లి చూస్తే ఆయన లేడు. పక్కింటివారిని అడిగితే నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వెంటనే ఆమె ఆటోలో ఆస్పత్రికి వెళ్లి రంగారెడ్డి గురించి వాకబు చేసి ఫలానా వార్డులో ఉన్నాడని తెలుసుకుంది. వెంటనే నేరుగా ఆయన వద్దకే వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛను అందించిన సరితను రంగారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

– మహానంది

మా వలంటీర్ చల్లగా ఉండాలి



కరోనా సమయంలో దగ్గు ఆయాసంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరాను. భయంతో ఎవరూ ఎవరి దగ్గరికి వెళ్లలేని పరిస్థితి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో నెల పింఛన్ రాదేమో అనుకున్నాను. అయితే మా వలంటీర్ సరిత నేను ఆస్పత్రిలో ఉన్న విషయం తెలుసుకుని నేరుగా నా వద్దకు వచ్చి వేలిముద్రలు తీసుకుని పింఛను అందించింది. సేవలకు ప్రతిరూపంగా, సొంత కుటుంబ సభ్యురాలిగా నా దగ్గరికి వచ్చి పింఛన్ ఇవ్వడం ఎప్పటికి మరవలేం –కల్లూరి రంగారెడ్డి

కుటుంబ సభ్యుల్లో ఒక్కడై



అంగన్‌వాడీ టీచర్ శివలక్ష్మితో కలిసి బాలింత రాణి కుటుంబానికి పౌష్టికాహారం ఇస్తున్న వలంటీర్ రాజు

పాములపాడుకు చెందిన రాజు అనే వలంటీర్ తన పరిధిలోని కుటుంబాలల్లో సభ్యుడిగా కలిసి పోయి సేవలందిస్తున్నాడు. కరోనా సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితుల్లేని సమయంలో కూడా ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అందించారు. అందులో భాగంగానే అంగన్‌వాడీ కార్యకర్త శివలక్ష్మితో కలిసి లాక్‌డౌన్ సమయంలో జగనన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని (బియ్యం, పప్పు, నూనె, 25 గుడ్లను) ప్రతి నెలా వారి ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించాడు.

వలంటీర్ వల్లే ఆరోగ్యంగా ఉన్నాం



నేను కరోనా సమయంలో బాలింతను, ఆ సమయంలో మా ఇంట్లో వాళ్లు మరీ జాగ్రత్తలు తీసుకున్నారు. మా వలంటీర్ రాజు మా ఇంటికి వచ్చి మాస్కులు, అవసరమైన మందులు ఇచ్చేవాడు. అంగన్‌వాడీ టీచర్‌తో కలిసి వచ్చి పౌష్టికాహారం అందించేవాడు. ఆ రోజు వలంటీర్లు లేకపోతే బయటకు వెళ్లి ఏ సరుకులు తెచ్చుకోలేని పరిస్థితి. వారు సరుకులు తెచ్చి ఇచ్చినందువల్లే నా బిడ్డను ఆరోగ్యంగా పెంచుకోగలిగాను. వలంటీర్లను సేవలను ఎంత గొప్పగా చెప్పినా తక్కువే.

-రాణి, పాములపాడు

జూపాడు ఆలయాల్లో చోరీ

జూపాడుబంగ్లా: మూడు రోజుల క్రితం కేజీరోడ్డు పక్కనే ఉన్న జూపాడు ఆంజనేయస్వామి, శ్రీజంబులాపరమేశ్వరీదేవి ఆలయాల్లో దొంగలు పడి దోచుకెళ్లారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా.. మూడు రోజుల క్రితం ఆలయాల్లో దొంగలు పడి ఆలయాల్లో హుండీలను పగులగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లారు. అలాగే హారతిపళ్లెం, గంటలు, వెండివస్తులు దోచుకెళ్లినట్లు సమాచారం. దొంగతనం జరిగిన మర్నాడు ఉదయం పూజారులు గుడికి వెళ్లగా ఆలయాలకున్న తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు హుండీలను ధ్వంసం చేసి అందులోని నగదును తీసుకెళ్లిన విషయాన్ని గుర్తించి, వెంటనే విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. అయితే విషయం విలేకరులకు తెలియజేయవద్దని పోలీసులు హుకుం జారీచేయటంతో పూజాలు జరిగిన విషయం బయటకు తెలియజేయలేదు. అయితే ఆలయాల్లో జరిగిన దొంగతనంపై ఫిర్యాదు చేసినా ఇప్పటిదాకా పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో భక్తులు, ఆలయాల అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో గతంలో చోరీలు జరిగిన ఘనటనలు చాలా ఉన్నాయి. పోలీసులు తగిన చర్యలు తీసుకొని రాత్రివేళల్లో పోలీసుల గస్తీ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేయటానికి యత్నించారన్నారు. అక్కడ ఏమీ దొంగతనం చేయలేదన్నారు. తాను సంఘటనా స్థలాన్ని పరిశీలించానని తెలిపారు.

ఆశ చూపి రూ. 95లక్షలు టోకరా

మహానంది: హైదరాబాదు నుంచి ఢిల్లీ వరకు మనకు మంచి పరిచయాలు, మైనింగ్ వ్యాపారాలున్నాయని ఒకరిని, ఉద్యోగం ఇప్పిస్తానని మరొకరిని మోసం చేసిన ఓ ఘనుడిపై మహానంది పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు సీతారామాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసుకునే బొల్లెద్దుల బాలిరెడ్డికి హైదరాబాదు, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన వాడిగా చెప్పుకునే అఖిల్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. తాను ఓ ఐఏఎస్‌కు తమ్ముడినని, మైనింగ్ వ్యాపారాలు చేస్తున్నానని, సీఎం చీఫ్ సెక్రటరీ తెలుసని నమ్మబలికాడు. మైనింగ్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే బోలేడు ఆదాయం వస్తుందని ఆశచూపాడు. దీంతో బాలిరెడ్డి పలు దఫాలుగా ఆయనకు ఫోన్‌పే ద్వారా సుమారు రూ.80లక్షలు చెల్లించాడు. అదే గ్రామానికి చెందిన నరసింహాచారికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15లక్షలు తీసుకున్నాడు. తిరిగి అడిగితే సమాధానం లేకపోవడంతో చెల్లింపుల ఆధారాలతో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఇదిలా ఉండగా ఇదే అఖిల్‌రెడ్డిపై బండిఆత్మకూరు, గోస్పాడు, నంద్యాల, తదితర పోలీస్‌స్టేషన్లలోనూ చీటింగ్ కేసులు నమోదైనట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

సున్నిపెంటలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

నంద్యాల(అర్బన్): శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతిల లేకుండా చేపడతున్న లాడ్జీలు, హోటళ్లు, ఇళ్ల నిర్మాణాలు, కుళాయిల ఏర్పాటును అడ్డుకోవాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి మంజులవాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ఇరిగేషన్ శాఖ వద్ద ఉన్న 208.74 ఎకరాలు గ్రామ పంచాయతీకి బదలాయించినట్లు తెలిపారు. ఇందు కోసం పంచాయతీలో జరుగుతున్న ఏ కట్టడానికైనా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కాకుండా కట్టడాలు చేపట్టిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

జూపాడుబంగ్లా: ప్రజల సమస్యలను పరిష్కరించడంపై గ్రామాల్లోని సచివాలయాల ఉద్యోగులు దృష్టి సారించాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ ఆదేశించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు సచివాలయ ఉద్యోగులందరూ తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చే అర్జీల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేసుకొని దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు.

ఉపాధి పనులు కల్పించండి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని ఆ గ్రామప్రజలు కోరుతున్నారు. గ్రామంలో నెలరోజుల నుంచి ఉపాధి పనులు కల్పించకపోవటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అరకొరగా కురిసిన వర్షాలకు గ్రామంలో 60శాతం మేర మాత్రమే విత్తనాలు సాగుచేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు నిరంతరం ఉపాధిపనులు కల్పించాలని జిల్లా అధికారులు పేర్కొంటున్నప్పటికీ కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని తాటిపాడు గ్రామంలో వెంటనే ఉపాధిపనులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు

బొమ్మలసత్రం: వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు పోలీసులతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉన్నత విద్యా, దేవాదాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మత్తు పదార్థాల నియంత్రణ అమలుపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ల పరిదిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి గంజాయి ఇతర మత్తు పదార్థాలపై దాడులు నిర్వహించి అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రుల్లో డి అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి మత్తుకు బానిసైన వ్యక్తులలో మార్పులు తీసుకురావాలని డాక్టర్లను కోరారు.